19

# మంత్రియుక్తి

వేంగదేశాన్ని సునుందడనే రాజు పరిపాలిస్తుండేవాడు.

అతనికి నరేంద్రుడు ఒక్కడే కొడుకు. వాడిని అల్లారుముద్దుగా పెంచుకున్నారు రాజదంపతులు.

నరేంద్రునికి బాల్య స్నేహితుడు ప్రదీపుడు. అతను సేనాధిపతి కొడుకు. వాళ్ళిద్దరిదీ ఒకే వయసు కావడంతో చిన్నప్పటినుంచి ఇద్దరూ ఎంతో స్నేహంగా ఉండేవారు.

ప్రదీపుడు ఏమంత తెలివిగలవాడు కాడు.., లక్షణాలు కూడా ఏమంత మంచివి కావు. అయినా... అతనిలో ఏమి ఆకర్షణ వుందో కాని, నరేంద్రుడు అతనిని ఒక్కక్షణం కూడా విడిచి ఉండలేకపోయేవాడు. ఇద్దరూ ఎంత సేపూ ఉబుసుపోక కబుర్లు చెప్పుకుంటూ కాలం గడిపేవారు.

చిన్న తనంలో అయితే సరిపోయింది కాని ,యుక్త వయసు వచ్చి రాజ్యభారం చేపట్టవలసిన సమయం వచ్చినా నరేంద్రునిలో మార్పులేక పోవడంతో చెప్పలేనంత దిగులు పడసాగాడు రాజుగారు. ప్రదీపునితో స్నేహం మానమని పోరినా నరేంద్రుడు వినలేదు.

రాజుగారి దీనావస్థను గ్రహించిన మంత్రి సుబుద్ధి – "ప్రభూ... మీరు దిగులుపడకండి ఉపాయంతో వాళ్లిద్దరినీ నేను వేరుచేస్తాను" అని మాట ఇచ్చాడు.

సుబుద్ధి నరేంద్రుడునీ, ప్రదీపుడినీ పిలిచి "మీరిద్దరూ రేపు ఉదయాన్నే ఉద్యానవనంలో నన్ను కలుసుకొనండి. మీతో కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడాలి" అన్నాడు.

మర్నాడు ఉదయమే మిత్రులిద్దరూ సుబుద్ధిని కలుసుకోవడానికి తోటలోకి వెళ్లారు.

కొంచెంసేపటికి సుబుద్ధి అక్కడికి వచ్చాడు. ముందుగా నరేంద్రుడిని పిలిచి కొంచెం దూరంగా తీసుకెళ్లాడు. ప్రదీపుడు చూసేటట్లు అతని చెవిలో "ఏమీలేదు" అని చెప్పాడు.



ఆ తర్వాత ప్రదీపుడిని పిలిచి నరేంద్రుడు చూసేటట్లుగా "నాకు ఏమీలేదు" అని చెప్పాడు. ఆ తరువాత తన దారిన వెళ్లిపోయాడు

మంత్రి వెళ్లిపోయాక మిత్రులిద్దరూ కలుసుకున్నారు.

"నీకు ఏమని చెప్పాడు మంత్రి..?" అని అడగాడు ప్రదీపుడు.

"ఏమీలేదు" అని, "మరి.., నీకేమని చెప్పాడు?" అడిగాడు నరేంద్రుడు.

"నాకు ఏమీలేదు" అన్నాడు ప్రదీపుడు.

"నీతో మంత్రి చెప్పిన రహస్యాలు దాస్తున్నావు!" అనుకొని పరస్పరం అనుమానించుకున్నారు ఆ ప్రాణ స్నేహితులు.

దాంతో... ఒకరినొకరు తిట్టుకుంటూ ఆ తర్వాత కొట్టుకోనడం మొదలు పెట్టారు.

చివరికి- "నీ ముఖం చూడను..!" అంటే, "నీ ముఖం ఎవరు చూస్తారు పో!" అనుకుంటూ ఇద్దరూ విడిపోయారు. ప్రదీపుడు అక్కడ ఉండడం ఇష్టంలేక దేశాంతరం వెళ్లిపోయాడు.

మంత్రిపాచిక పారినందుకు రాజుగారు ఎంతో సంతోషించారు.

తర్వాత కొంతకాలానికి నరేంద్రుడు రాజయ్యాడు. కొంత అనుభవం వచ్చాక - మంత్రి తనను పరిదిద్దడానికి అలా చేశాడని గ్రహించాడు.

ప్రదీపుని వెతికి తెప్పించి తిరిగి స్నేహం చేశాడు. అయితే...ఈసారి తమ స్నేహం ఇతరులకు ఆదర్శవంతంగా ఉండేటట్లు చేశాడు.

★★★

